గ్రేటర్‌లో పలు చోట్ల వర్షం

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి వా న కురిసింది. రాత్రి 9గంటల వరకు పటాన్‌చెరులో 1.35సెం.మీ, లింగంపల్లిలో 1.18 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లోని మహదేవ్‌పురంలో 1.10సెం.మీ, ముషీరాబాద్‌లో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. వాయుగుండం కొనసాగుతుండడంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరి కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 30.8డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.3డిగ్రీలు, గాలిలో తేమ 69శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్

నందిగామ : రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో సురేశ్

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 16 : గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులతో శానిటేషన్, ఎల్‌ఆర్‌ఎస్‌పై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త, పారిశుధ్య పనులపై గ్రామస్తులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామస్తులకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎవరైనా తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఎల్‌అర్‌ఎస్‌పై డీపీవో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో మలారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై అసంతృప్తి

ఎలికట్ట గ్రామాన్ని డీపీవో డీఎల్‌పీవో, ఇన్‌చార్జి ఎంపీడీవోతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను, కుళాయిలు, చెత్త సేకరణ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, వాటర్ ట్యాంకులు, డంపింగ్ యార్డు తదితర వాటిని పరిశీలించారు. కుళాయిల నుంచి నీరు వృథాగా పోవడాన్ని గమనించారు. పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి తేజస్వినికి మెమో జారీ చేశారు.

చేగూర్ పంచాయతీలో..

నందిగామ : మండల పరిధిలోని చేగూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని డీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. శానిటేషన్, వాటర్ సప్లై, వాటర్ లీకేజీలు, డ్రైనేజీ సమస్యల గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా కొనసాగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచన

ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబర్ 16 : ఖరీఫ్ 2024-25 సంవత్సరానికి గాను ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వానకాలం పంట ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా, పూర్తిగా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ధాన్యం సేకరణ ముగిసేవరకు పకడ్బందీగా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. జిల్లాలో 125 సెక్టార్ల నుంచి 1.5లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందన్నారు. 42,382 మెట్రిక్ టన్నుల సన్న రకానికి 18 కేంద్రాలు, 62,617 మెట్రిక్ టన్నుల దొడ్డు రకానికి 107 కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా వేయింగ్ మిషన్, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కోసం ట్యాబ్‌లు సమకూర్చుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలును నిరంతరం పర్యవేక్షించి ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకొని రైతులకు నష్ట పరిచే ప్రయత్నాలను ఎంత మాత్రం ఉపేక్షించబోమన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలు రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున ధాన్యం సేకరించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అదనపు లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి పాల్గొన్నారు.

మబ్బు వదిలితేనే.. గబ్బు తొలిగేది

పెద్దఅంబర్‌పేటలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రజా మరుగుదొడ్డి

- అస్తవ్యస్తంగా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు, మండిపడుతున్న ప్రజలు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 16 : మున్సిపాలిటీలో ప్రజా మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. వాటిని చూస్తేనే గబ్బుగబ్బు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆ దుర్వాసన భరించలేక టాయిలెట్ కోసం చెట్ల చాటుకు పరుగులు తీసే పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మున్సిపాలిటీలో చాలా వరకు ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా పడి ఉండగా.. ఉపయోగంలో ఉన్నవాటి పరిస్థితి దారుణంగా ఉన్నది. ప్రజల అవసరాలు తీర్చేందుకు రూ.లక్షలు వెచ్చించి ప్రజా మరుగుదొడ్లను ఏర్పాటుచేశారు. పెద్దఅంబర్‌పేటలో రెండు చోట్ల, పసుమాములలో రెండు చోట్ల, కుంట్లూరు, తట్టిఅన్నారంలో ఒక్కో చోట ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. వీటిలో తట్టిఅన్నారంలో ఉన్నది శాశ్వత భవనం. మిగతావి పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసినవి. ఇందుకోసం భారీగానే నిధులు వెచ్చించారు. ఏర్పాటు చేసేవరకు బాగానే ఉన్నా.. వాటి నిర్వహణలో మాత్రం అధికారులు వెనుకబడ్డారు. దీంతో కనీసం వాటి తలుపు తీసి అందులోకి వెళ్లే పరిస్థితులు కూడా కనిపించడంలేదు. తీవ్రమైన దుర్వాసన వస్తున్నది. పలుచోట్ల నీటి సదుపాయమే లేదు. రెండు చోట్ల నీటి సదుపాయం ఉన్నా.. లోపల దుర్గంధంగా మారింది. కనీసం వాటిని పట్టించుకునేవారే కరువయ్యారు.

పెద్దఅంబర్‌పేటలో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న మరుగుదొడ్డి ఉపయోగంలోనే లేదు. అందులో మొలిచిన మొక్కలు చెట్లుగా మారుతున్నాయి. కనీసం ప్రజా మరుగుదొడ్డిలోకి అడుగుపెట్టే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దాని పక్కనే శ్మశానవాటిక ఉన్నది. అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలతో అక్కడ ఎప్పుడూ జనం కనిపిస్తూనే ఉంటారు. అయితే, ప్రజా మరుగుదొడ్డి మూలనపడి మహిళలు కనీస అవసరాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం అటుగానే వెళ్లే మున్సిపల్ అధికారులకు తమ సమస్యలు పట్టడం లేదని పలువురు మహిళలు మండిపడుతున్నారు. పెద్దఅంబర్‌పేటలోని కొహెడ రోడ్డులో ఉన్న మరుగుదొడ్డి పరిస్థితి దారుణంగా ఉన్నది. అక్కడ ప్రయాణికులు అధికంగా ఉంటున్నా.. వాటిని ఉపయోగించలేని పరిస్థితి నెలకొన్నది. తీవ్ర దుర్వాసనతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తట్టిఅన్నారంలో కట్ట మైసమ్మ ఆలయం సమీపంలో ఏండ్ల కిందట ప్రజా మరుగుదొడ్డి కోసం శాశ్వత నిర్మాణం చేపట్టారు. కానీ, ప్రజలు తమ అవసరాలు తీర్చుకునేందుకు అనువుగా లేదు. జనానికి దూరంగా ఉండటమే ఇందుకు కారణం. మరోవైపు, దాని నిర్వహణ సైతం అంతంత మాత్రమే.

నిరుపయోగంగా పసుమాములలోని ప్రజా మరుగుదొడ్డి

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ, పోలీసు అధికారులు

చిరుత దాడి.. ఎద్దు మృతి

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ, పోలీసు అధికారులు

యాలాల, అక్టోబర్ 16 : యాలాల మండలం రెళ్లగడ్డతండాలో పొలం వద్ద కట్టేసిన ఎద్దు చిరుత దాడిలో మృత్యువాతపడ్డ సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు, అటవీ, పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గోప్యానాయక్ తన పొలం వద్ద ఆవులు, ఎద్దులను రోజు మాదిరిగానే కట్టేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా ఓ ఎద్దు గాయాలతో మృతిచెంది ఉన్నది. విషయం తెలుసుకున్న అటవీ, పోలీసు అధికారులు ఎఫ్‌ఆర్‌వో రాజేందర్, ఎస్‌హెచ్‌వో శంకర్, సెక్షన్ ఆఫీసర్ శంకర్, బీట్ ఆఫీసర్ కాశప్పలతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పాద ముద్రలు చిరుతపులివిగా గుర్తించారు. రాత్రి సమయంలో పొలాలకు వెళ్లవద్దని రైతులకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మండల పరిధిలోని జుంటుపల్లి, రెళ్లగడ్డ తాండ, బండమీదిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. రాత్రి సమయంలో ఒంటరిగా అడవి వైపునకు వెళ్లవద్దన్నారు. చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఎఫ్‌వోను ఆదేశించినట్లు తెలిపారు. ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గస్తీ నిర్వహించాలని తాండూరు డీఎస్పీ, యాలాల ఎస్‌ఐలకు సూచించారు.

అనుమతులు తప్పనిసరి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. రవీంద్రయాదవ్
- పైల్స్ కేర్ సెంటర్ సీజ్

కొడంగల్, అక్టోబర్ 16 : ఆసుపత్రులు, ల్యాబ్‌ల వంటి వాటి ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొంది ఉండాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డా.రవీంద్రయాదవ్ హెచ్చరించారు. బుధవారం పట్టణ పరిధిలోని ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి రెండు ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు, సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకుండా ఆసుపత్రులను నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టణంలో పరిశీలించిన ప్రైవేటు ఆసుపత్రితోపాటు పైల్స్ కేర్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా, పూర్తిస్థాయి సౌకర్యాలు లేకుండానే ఏకంగా పైల్స్ సెంటర్‌లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆయా సందర్భాల్లో కొంతవరకు తీవ్ర పరిణామాలు కూడా ఏర్పడినట్లు పేర్కొన్నారు. అనుమతులు తీసుకోవాలని పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిర్లక్షంగా వ్యవహరించడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని ఆసుపత్రులు కానీ, ల్యాబ్‌లు వంటి వారు తప్పకుండా డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని సూచించారు. లేదంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని, మరో పది రోజుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు లేనివాటిని సీజ్ చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పైల్స్ కేర్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

20న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధుల సమావేశం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 16 : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ముఖ్య ప్రతినిధుల సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్టు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని గాంధీయన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని, ఉత్తమ రైతులకు పుడమిపుత్ర అవార్డులు, కిసాన్ సేవా రత్న అవార్డులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వికారాబాద్ సీఐగా భీమ్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 16 : వికారాబాద్ జిల్లాలో ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. వికారాబాద్ సీఐ సస్పెండ్ అవ్వడంతో ధారూరు సీఐ భీమ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. వికారాబాద్ టౌన్ సీఐగా భీమ్‌కుమార్, ధారూరు సీఐగా రఘురాములును నియమిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్‌లో సీసీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న రఘురాములును ధారూరు సీఐగా నియమించారు. సీఐగా పనిచేసిన నాగరాజు ఓ కేసు విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన ధారూరు సీఐ భీమ్‌కుమార్‌కు వికారాబాద్ సీఐగా పూర్తి బాధ్యతలు అప్పగించారు.

కొత్త నిబంధనలతో కొర్రీలు..!

హైడ్రా బూచీ, పంచాయతీ.. లేఅవుట్లంటూ కొత్త పాట

అయోమయంలో 'ఎల్ఆర్ఎస్'

లేఅవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల ప్రక్రియ ఇష్టారాజ్యంగా సాగుతున్నది. ఇప్పటి వరకు పరిష్కరించిన వాటి కంటే తిరస్కరించిన దరఖాస్తులే అత్యధికంగా ఉన్నాయి. ప్లాట్ యజమానులను భయాందోళనలకు గురి చేసేలా ఏదో ఒక కారణం చూపి దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని అధికారులపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు హైడ్రా, మరోవైపు గ్రామ పంచాయతీ లే అవుట్‌లు అంటూ సరికొత్త నిబంధనలు పెడుతూ పెద్దఎత్తున దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో ఎల్ ఆర్ఎస్ ఆమోదించిన లేఅవుట్‌లోని ప్లాట్‌లకు కూడా ఈసారి 'ఎల్ఆర్ఎస్' తిరస్కరిస్తున్నారు. దీనిపై ప్లాట్ యజమానులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఆదాయంపై భారీ ఆశలు పెట్టుకోగా, కనీసస్థాయిలో కూడా ఆదాయం రావడంలేదని సమాచారం.

-హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ సుల్తాన్‌పూర్ పరిధి సర్వే నంబర్ 457/1 లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో 2016లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆమోదించింది. అదే సర్వే నంబర్, అదే లే అవుట్‌లో అప్పుడు ఎల్ఆర్ఎస్‌కు వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోనివారు 2020లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ అర్జీలను అధికారులు తిరస్కరిస్తున్నారు. గతంలో హెచ్ఎండీఏ అధికారులే ఈ లేవుట్‌కు ఎల్ఆర్ఎస్‌ను ఆమోదించారు. కానీ ఇప్పుడు దరఖాస్తు తిరస్కరించడం వెనుక మతలబు ఏమిటని ప్లాట్ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్ తిరస్కరించడం ద్వారా గతంలో ఎల్ఆర్ఎస్ ఆమోదించినవారికి అనుమతులు ఉన్నట్టా...? లేనట్టా అనే అనుమానాలను యజమానులు వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా సంవత్సరాల కిందట ప్లాట్‌లను కొనుగోలు చేశామని, వాటికి ఇప్పుడు ఎల్ఆర్ఎస్ తిరస్కరించడాన్ని ప్రశ్నిస్తున్నారు. 15 ఏండ్ల కిందట గ్రామ పంచాయతీ చేసిన లే అవుట్‌లను ఇప్పుడు తిరస్కరించడాన్ని యజమానులు నిలదీస్తున్నారు.

మొత్తం 25.70 లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో మొత్తం 25.70 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో జీహెచ్ఎంసీలో 1.06 లక్షలు, హెచ్ఎండీఏలో 3.58 లక్షలు, పట్టణాభివృద్ధి సంస్థలు పరిధిలో 1.35 లక్షలు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 13.68 లక్షలు, పంచాయతీల్లో 6 లక్షల దరఖాస్తులు వచ్చాయి. 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలల పాటు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. ఓపెన్ ప్లాట్లు, నాన్ లేఅవుట్‌కు సంబంధించిన వాటికి దరఖాస్తుదారులు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించి, తమ డాక్యుమెంట్ కాపీని సమర్పించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప..ఇతర లే-అవుట్లను క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ కోసం జిల్లాకో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హెచ్ఎండీఏ, డీటీసీపీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విషయంలో గందరగోళాన్ని తొలగించాలని, వినతులను పట్టించుకోవాలని ప్లాట్ యజమానులు కోరుతున్నారు.

రిపోర్టర్ గౌతంగౌడ్‌కు బెయిల్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిని అవమానపరిచే విధంగా సామాజిక మాధ్యమం వేదికగా పోస్టులు పెట్టినట్టు సైబర్‌క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో రిపోర్టర్ గౌతంగౌడ్‌కు 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.10వేల చొప్పున ఇద్దరి పూచీకత్తుపై జమానత్‌లను న్యాయవాది లక్ష్మణ్ కోర్టుకు సమర్పించారు. విడుదల పత్రం అందిన పిదప చంచల్‌గూడ జైలు అధికారులు నిందితుడిని విడుదల చేశారు. రాజకీయ ఒత్తిడి పెంచే విధంగా వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు నిందితుడిపై కేసు నమోదు చేశారు. సెక్షన్లు 353(1), 353(2), 352, 336 (4), 351(4), 196తో పాటు 67 ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. 18 రోజుల పాటు జైలులో ఉన్న నిందితుడికి ఎట్టకేలకు బెయిల్‌ను మంజూరు చేస్తూ కోర్టు ఆదేశించింది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలను పోస్టు చేసినట్టు నిందితుడిపై ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఇతర పోలీసు స్టేషన్లలో కూడా కేసులు నమోదు చేశారు.

నాలాలో పడిన వ్యక్తిని కాపాడిన డీఆర్ఎఫ్ బృందం

నాలాలో పడిపోయిన స్వామిని కాపాడిన రెస్క్యూటీమ్

సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్ పరిసరాల్లోని లీలానగర్ నాలాలో పడిపోయిన వ్యక్తిని హైడ్రా రెస్క్యూ టీమ్ కాపాడింది. బుధవారం తెల్లవారుజామున నాలాలో బానోత్ స్వామి(45) పడిపోయాడు. స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే డీఆర్ఎఫ్‌కు సమాచారమివ్వడంతో.. ఖైరతాబాద్ జోన్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు తన బృందంతో ఘటనా స్థలానికి చేరుకొని.. బానోత్ స్వామిని కాపాడారు. చలిలో వణుకుతున్న స్వామికి పొడి దుస్తులు ఇచ్చి.. అల్పాహారం అందించారు. అనంతరం ఆస్పత్రిలో చూపించి, వృద్ధాశ్రమంలో చేర్పించినట్లు ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు తెలిపారు.

శివారుల్లో వృద్ధ దంపతుల దారుణ హత్య

- హంతకులెవరు.. దోపిడీ దొంగలా..? సైకోనా..?
- వ్యవసాయ క్షేత్రంలో ఆధారం లేని మర్డర్స్
- ఒంటరిగా ఉండే వారిలో భయాందోళనలు
- సీసీ కెమెరాలు లేకపోవడంతో ముందుకుసాగని దర్యాప్తు..!

హత్యకు గురైన వృద్ధ దంపతులు (ఫైల్)

కందుకూరు, అక్టోబర్ 16 : హైదరాబాద్ శివారులోని వ్యవసాయ పొలాల్లో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. నిందితులు దోపిడీ దొంగలా..? ఇంటి దొంగలా..? సైకో పనా..? పోలీసులు ఎటూ తేల్చలేకపోతున్నారు. కందుకూరు మండల పరిధి, కొత్తగూడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఊశయ్య (70), భార్య శాంతమ్మ (65) దంపతులు. అదే గ్రామానికి చెందిన మనోహర్ రావుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రానికి కాపాలాగా ఉంటున్నారు. ఈ వ్యవసాయ క్షేత్రం కందుకూర మండలం పరిధిలోని కొత్తగూడ గ్రామంలో ఉంది. అక్కడున్న మామిడి తోటలోనే ఈ దంపతులు నివాసముంటున్నారు. చుట్టుపక్కల ఎవరూ ఉండరు. మంగళవారం రాత్రి గుర్తు దుండగులు శంతమ్మను రూమ్‌లో హత్య చేసి, మామిడి తోటలోకి తీసికెళ్లి ఊశయ్యను హతమార్చారు. ఇదిలా ఉండగా.. మంగళవారం రాత్రి యజమాని ఆ వృద్ధ దంపతులకు ఫోన్ చేయగా మాట్లాడకపోవడంతో నిద్రిస్తున్నట్టు భావించాడు. బుధవారం తెల్లవారుజామునే స్థానికంగా తెలిసిన వాళ్లకు చెప్పి.. వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లిరమ్మని చెప్పాడు. సదరు వ్యక్తి అక్కడికి వెళ్లి చూడగా.. వృద్ధులు శవమై రక్తపు మడుగులో కనిపించారు. ఈ సమాచారాన్ని మనోహర్ రావుకు తెలపడంతో.. ఆయన పోలీసులకు సమాచారమిచ్చాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించారు. ఘటనా స్థలానికి ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి చేరుకొని.. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హంతకులెవరు..?

ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆధారాల కోసం పోలీసులు భిన్న కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఒకపక్క మామిడి తోట.. మరోపక్క వరి చేనులు, మధ్యలో నీళ్లు ఉన్నాయి. ఘటన జరిగిన తరువాత డాగ్ స్క్వాడ్‌కు కూడా ఆధారాలు లభించలేదు. నిందితులు నీళ్లలో నుంచి పరారయ్యారా.? అనే అనుమానాలున్నాయి. ఈ వృద్ధులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎవరైనా మద్యం మత్తులో అక్కడికి వెళ్లి వృద్ధులతో గొడవకు దిగారా.? దుండగులు ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తే వృద్ధులు అడ్డుకున్నారా.? దుండగులతో వృద్ధులు పెనుగులాడిన అనవాళ్లున్నాయి. వృద్ధురాలి గాజులు పగిలిపోయి ఉండటంతో పెనుగులాట జరిగినట్లు కనిపిస్తోంది. ఇటీవల ఒంటరిగా ఉండే వృద్ధులను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. అందులో రెండు మూడు ఘటనలను ఇప్పటీ పోలీసులు ఛేదించలేకపోయారు. శివారుల్లో సైకో తిరుగుతూ.. ఒంటరి వృద్ధులపై దాడులు చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈ దారుణాన్ని కూడా సైకో చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు చిన్నపాటి ఆధారం కూడా వదలకుండా అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలంలో లభించిన కొన్ని ఆధారాలతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు.

అమరావతికి ఆమ్రపాలి

ఆమె సేవలు మూడు నెలల ముచ్చటే

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ (ట్రిబ్యునల్) ఆదేశాల మేరకు ఆమ్రపాలి ఏపీ ప్రభుత్వంలో బుధవారం రిపోర్టు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి సేవలు మూడు నెలల ముచ్చటగానే మిగిలాయి. 2024 జూన్ 26న కమిషనర్ రోనాల్డ్ రాస్ సెలవులో వెళ్లిన సందర్భంగా ఆమ్రపాలికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించారు. తర్వాత 2024 ఆగస్టు 21 నుంచి పూర్తిస్థాయి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. నాలుగు నెలల తిరగకముందే అమరావతికి ఆమ్రపాలి రిపోర్టు చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కంటే ముందు ఆమ్రపాలి మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీగా, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తూనే బల్దియా కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. కొన్ని రోజులు మూడు బాధ్యతలు నిర్వర్తించారు. ఏ బాధ్యతల్లోనూ తన కంటూ ప్రత్యేక ముద్రను వేసుకోలేకపోయారు. ప్రధానంగా జీహెచ్ఎంసీలో మహిళా ఉద్యోగులకు ప్రతి జోన్‌కు ఒక బేబీ కేర్ సెంటర్ ఏర్పాటు లాంటి కీలక నిర్ణయం తప్ప.. పెద్దగా సంస్కరణలు, కొత్త విధానాలు తీసుకువచ్చే ప్రయత్నమేమీ చేయకపోవడం, ప్రజావాణికి, జోనల్ కమిషనర్లకు, విజిటింగ్ సమయంలో వచ్చే పౌరులకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బక్కచిక్కిన సంస్థ ఖజానాను గాడిలో పెట్టే ప్రయత్నం కానీ, పారిశుధ్య నిర్వహణను చక్కదిద్దడంలో విఫలం అయ్యారనే ఆరోపణలున్నాయి. వందకు వంద శాతం చెత్త సేకరణ, శానిటేషన్ విభాగంలో అక్రమాలను అడ్డుకట్ట వేయలేకపోయారు.

ఏడాదిలోపే క్యూ కడుతున్న కమిషనర్లు

గ్రేటర్‌లో కీలకమైన శాఖ ఏదైనా ఉందంటే అది జీహెచ్ఎంసీ మాత్రమే. కోటి మందికి పైగా జనాభా కలిగిన నగరంలో పౌరులకు మౌలిక వసతుల కల్పన, మెరుగైన సేవలందించడంతో జీహెచ్ఎంసీదే ముఖ్య భూమిక. అలాంటి కీలకమైన శాఖకు కమిషనర్‌గా పట్టుమని రెండేండ్లు సైతం ఉండటం లేదు. కారణం ఏదైనా అలా వచ్చి.. ఇలా వెళ్తున్నారు. ఆమ్రపాలి వెళ్లిపోవడంతో ఏడాదిలోపే మూడో కమిషనర్ రావడం అనివార్యత ఏర్పడింది. ఆమ్రపాలి కంటే అంతకు ముందు ఉన్న కమిషనర్ రోనాల్డ్ రాస్ సైతం బల్దియాపై పట్టు సాధించి గాడిలో పెట్టే సమయంలోపే ప్రభుత్వం ఇంధనశాఖకు బదిలీ చేసింది. దీంతో దాదాపు ఏడాది గడవకముందే రోనాల్డ్ రాస్ సేవలు జీహెచ్ఎంసీలో ముగిసినట్లైయింది. తర్వాత వచ్చిన కమిషనర్ ఆమ్రపాలి ప్రస్తుత పరిణామాలతో నాలుగు నెలల్లోపే జీహెచ్ఎంసీనే కాదు రాష్ట్రాన్ని వీడాల్సి వచ్చింది. గడిచిన 11 నెలల్లోనే జీహెచ్ఎంసీకి ఇద్దరు కమిషనర్లు మారడం గమనార్హం.